విశాలాంధ్ర

# జన సురక్ష సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్



**విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ :** తిరుపతి జిల్లాలో ఈనెల జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం వారి ఆదేశానుసారం 3 నెలలు జిల్లాలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలో 774 గ్రామ పంచాయతీలలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహించ నున్నామని, దీని యొక్క ముఖ్య ఉద్దేశం గ్రామ స్థాయి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం భీమా పథకాల గురించి అవగాహన కల్పిస్తూ సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక్కరికి పథకం గురించి వివరిస్తూ లబ్ధి పొందేలా చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం జెడివైరి- కేవైసీ వంటి మరెన్నో కేంద్ర ప్రభుత్వం బీమా పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే దిశగా కార్యక్రమం ముందుకు సాగనుందని అన్నారు. ప్రతి ఒక్కరికి అవగాహనతో పాటు అకౌంట్ ఓపెన్ చేయడం ఈ కేవైసీ వంటి ప్రక్రియలను కూడా చేపట్టాలని తెలిపారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున వారి ఖాతాలకు సంబంధించిన మొబైల్ నెంబర్ కు ఎటువంటి ఓటీపీలు వచ్చిన, ఎవరు కాల్ చేసి ఓటీపీ అడిగినా లింకు పై క్లిక్ చేయమని చెప్పినా చేయవద్దని అందుకు తగిన అవగాహనను లబ్ధిదారులకు కల్పించాలని తెలిపారు. కావున భారత ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సైబర్ కేసులు నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు సంబంధించిన పాంప్లెట్స్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

Date: 02/07/2025, Edition: 105(Chittoor), Page: 8
Source : https://epaper.visalaandhra.com/